1

# ఒక ప్రాచీన పత్రికనుండి ఒక ఆధునిక సందేశము (1:1)

ప్రాథమిక పాఠశాలలో చదువుకొన్న పుస్తకాలు ఇప్పుడు కాలానుగుణంగా మార్చబడినవని నీవు పరిశీలించావా? అలాగైతే, అవి ఇంకా కాలానుగుణముగా మార్చబడలేదా? సంవత్సరములు గడుస్తున్న కొలది క్రొత్త నియమములు భౌతిక శాస్త్రమునకు చేర్చబడినవి మరియు రసాయన పట్టికలో క్రొత్త మూలకాలు చేర్చబడినవి. "క్రొత్త" గణితము ఇప్పుడు చాలా పాతదైపోయింది. గతమును గూర్చిన పునరావలోకనం చేయడానికి మాత్రమే కొన్ని పాత పుస్తకములు ఉపయోగపడగలవు.

స్పష్టముగా, పాత తరముల యొక్క పోకడలను, పంతొమ్మిది వందల సంవత్సరాలకు ముందు యేసునందు విశ్వాసముంచినవారికి వ్రాయబడిన పత్రికను చదువుటను ప్రారంభించుదాము, చాలా ప్రశ్నలు అడగవచ్చును. గడిచిపోయిన కాలముతో పాటు పత్రిక పనికిరానిదయిందా? ఈ పత్రికను చదువుట చారిత్రిక ఉద్దేశముతో మరియు అధ్యయనము కొరకేనా? ఈ పాత పత్రిక నేడు ఇరవై ఒకటవ శాతాబ్దమునకు తగినదిగా ఉంటుందా?

యాకోబు చేత వ్రాయబడిన ఈ పత్రిక మన కాలములకు ప్రాచీనమైనదైనప్పటికి, అది నేటి విశ్వాసులైన ప్రతి ఒక్కరికి సంబంధించినది అని మనం తెలుసుకుంటాం.

యాకోబు పత్రిక, బైబిలు పుస్తకములన్నింటివలె వాస్తవమైనది, అది రెండు భిన్న కాల పరిస్థితులకు సంబంధించినది. మొదటిది, ఆ పత్రిక రాసిన కాల పరిస్థితికి సంబంధించినది. యాకోబు పత్రిక మొదట దైవ ప్రేరణగల ఒక రచయిత చేత, వాటియందలి విశ్వాసము వారి జీవితములలో మార్పు తెచ్చునని బోధించుటకు రాసినది, విశ్వాసులు ఆ గ్రంథమును చదివిరి, పఠించిరి, విశ్వాసము తమ నిత్య జీవితములో ఎంతో ముఖ్యమైనదని గ్రహించిరి. రెండవ కాల పరిధి వర్తమానము, పత్రిక యొక్క వాస్తవమైన ఆరంభ జీవిన కాలమును గూరించి మనము నేర్చుకొనుటవలన, పత్రికలోని *"అప్పుడు,"* నేటి క్రైస్తవుని జీవనమునకు "ఇప్పుడు" సరియైన ఆలోచోనలను కలుగజేయును. ఈ పత్రిక మన క్రైస్తవ విశ్వాసమునందు మనము నేటి ప్రపంచములో ఏదుర్కొను విచారణలలో, శోధనలో ఆర్థికమైన లావాదేవీలుగల సంబంధాలలో ఒక మార్పును కలిగించును.

గ్రంథకర్త యొక్క పరిచయముతో, పాఠకులను పేర్కొనుచు, మరియు శుభములు తెలుపుచూ మొదటి శతాబ్దపు రచనా శైలిలోనే ఈ పత్రిక యిలా ప్రారంభించబడినది – "దేవునియొక్కయు ప్రభువైన యేసు క్రీస్తు యొక్కయు దాసుడైన, యాకోబు అన్య దేశములయందు చెదరియున్న పండ్రెండు గోత్రములవారికి శుభమని చెప్పి వ్రాయునది" (1:1). ప్రాచీనమైన ఈ విశ్వాసపు పత్రిక, మన జీవితములో ఏవిధమైన మార్పు కలుగజేయునని అవగాహన చేసుకొనుటకు, పత్రిక యొక్క పూర్వ చరిత్రను ఆలోచించవలయును. చారిత్రాత్మక ఆరంభములను, సిద్ధాంతపరమైన ఉద్దేశమును, వ్యక్తిగతమైన శైలిని ఆలోచించుము. [1]

## చారిత్రాత్మకమైన సన్నివేశాలు

బైబిలు గ్రంథములోని పుస్తకములు ఆకాశమునుండి బంగారు పళ్ళెములో పడలేదు, దానియొక్క సహజ అద్వితీయ ప్రారంభము లేదా చారిత్రాత్మక ఆరంభమును మనము కనుగొనవచ్చును. దేవుడు, పరిశుద్ధాత్మ ద్వారా పనిచేయుచు, నానావిధమైన పరిస్థితులలో జీవిస్తున్న ప్రజలతో మాట్లాడుటకు రచయితలను ప్రేరేపించాడు. దానికి తోడుగా, బైబిలులోని పుస్తకములు అద్వితీయమైనవి; దేవుని యొక్క వాక్యము ప్రత్యేకమైన మానవ అవసరతలకు ఉద్దేశించబడినది. *"ఇప్పుడు,"* మనకొరకు దేవుని యొక్క సందేశమును అర్థము చేసుకొనుటకు, పుస్తకము వ్రాయబడినప్పటి చారిత్రిక సన్నివేశాన్ని మనము చూడవలయును. గ్రంథకర్తను మరియు వాస్తవమైన పాఠకులను చదివితే యాకోబు పత్రిక ఎందుకొరకు వ్రాయబడిందో మనము నిర్ణయించుటకు మనకు సహాయపడును.

### గ్రంథకర్త

బైబిలునందున్న ఒక పుస్తకమును ఎవరు వ్రాశారనే దానిని నిర్ణయించుట చాలా సందర్భములలో కష్టమైన పని. రచయితను గూర్చి చెప్పిన పౌలు యొక్క పత్రికవలె ఉన్న కొన్ని బైబిలు పుస్తకముల రచయిత ఎవరో కనుగొనగలం. మిగిలిన పుస్తకముల రచయితలు ఎవరని కనుగొనడము కష్టముగా మారినది. ఎందువలననగా, అవి వ్రాయబడిన కాలమునుండి తొలగి మనము చాలా దూరముగా ఉన్నాము మరియు రచయితను గూర్చి అనేకమైన అస్పష్టమైన ఊహాగానాలు చేయబడుతున్నాయి.

యాకోబు పత్రిక దాని రచయితను పేర్కొనుచున్నది, కాని అతని యొక్క నిజమైన గుర్తింపును నిర్దిష్టంగా చెప్పలేదు: "దేవుని యొక్కయు ప్రభువైన యేసు క్రీస్తు యొక్కయు దాసుడైన, యాకోబు." సమస్య ఏమంటే ఈ దినములవలె మొదటి శతాబ్దములో కూడా "యాకోబు" అనే పేరు చాలా సామాన్యమైనది. నిజానికి క్రొత్త నిబంధనలో నలుగురు వ్యక్తులు యాకోబు అను పేరును కలిగియున్నారు: జెబదయ కుమారుడైన యాకోబు మరియు యోహాను యొక్క సోదరుడు; అల్ఫయ కుమారుడైన యాకోబు; శిష్యుడైన యూదా తండ్రియైన యాకోబు; మరియు యేసు యొక్క (చాలా ఖచ్చితముగా, మారు తల్లి [తండ్రి] యొక్క కుమారుడు) సోదరుడు. పత్రికల రచయితలను గూర్చి చర్చించుటకు చాలా కాగితములు మరియు సిరా ఉపయోగించబడినది, ప్రభువు యొక్క – సహోదరుడు దీనియొక్క వాస్తవమైన రచయిత అని ఆలోచించి చెప్పుటసరిపోవును.

రచయిత తనను తాను, "దేవుని యొక్కయు ప్రభువైన యేసు క్రీస్తు యొక్కయు దాసుడైన" అని వివరించాడు. "దాసుడు" అను పదము *doulos* గ్రీకు పదమునుండి తర్జుమా చేయబడినది. అతడు ఒక యజమానుని దాసుడు అని అర్థం. తనను తాను దేవుని సొత్తుగా యాకోబు ఆలోచించాడు, మరియు దేవుడు ఏమి ఆజ్ఞాపించాడో దానినే చేయుటకు ఆయన బలవంత పెట్ట బడ్డాడని అతను విశ్వసించాడు. ప్రభువుతో ఆయనకు ఉన్న సంబంధమును గూర్చి ఆయన చెప్పదలచుకున్న దానినంతటిని అలోచించు: "యాకోబు, యేసునకు ఇష్టమైన సోదరుడు"; అని ఆయన చెప్పదలచుకున్న దానినంతటిని ఆలోచించుము: "యాకోబు, ప్రభువుతో పదునెనిమిది సంవత్సరాలపాటు ఒకే గదిలో నిదురించినవాడు"; లేక "యాకోబు, జీవించియున్న వారిలో యేసును ఎక్కువగా ఎరిగినవాడు." అయినప్పటికి, అతనికున్న

కుటుంబ సంబంధముతో ఇతరులకు ఆసక్తి కలిగించుటకు ప్రయత్నించుటకు బదులు, దేవునికి మరియు యేసు క్రీస్తుకు దాసుడుగా మాత్రమే తనను గురించి తెలుపుకొన్నాడు.

**పాఠకులు**

"అన్యదేశములయందు చెదరియున్న పండ్రెండు గోత్రముల వారు" ప్రారంభ పాఠకులుగా నిర్ణయించబడినది. ఈ సంబోధన ఎవరికి ఉద్దేశింపబడినా, పత్రిక యొక్క పాఠ్యాభాగమునుండి వారు క్రైస్తవులని మనము తెలుసుకొంటున్నాము (2:1; 5:7). ఈ మొదటి క్రైస్తవులు బహుశ ఆది సంఘమునకు కలిగిన శ్రమల వలన "చెదరిపోయిన" వారైయున్నారు. యాకోబు ఉపయోగించిన పదశైలి "పండ్రెండు గోత్రములు" అన్నది బహుశ దేవుని ప్రజలందరిని – అనగా ఆత్మీయ ఇశ్రాయేలును ఉద్దేశించబడినది. ఈ కారణముచేత యాకోబు పత్రిక ఒక "సాధారణ పత్రికగా" పిలువబడుచున్నది. వాస్తవముగా యాకోబు పత్రిక ఒక స్థానిక సంఘమునకు సంబోధించినది కాదు. అయితే, ప్రపంచ వ్యాప్తముగా ఉన్న విశ్వాసులను ఎదుర్కొనుచు వారి యొక్క క్రైస్తవ విశ్వాసము వారి జీవితములో ప్రత్యేకతను ఎలా సంతరించుకోవాలో చెప్పుటకు అతను కోరిక కలిగియున్నాడు.

**సిద్ధాంత పరమైన అంశం**

యాకోబు హఠాత్తుగా ఒక దినమున కూర్చొని క్రైస్తవులకు సాధారణమైన పత్రిక వ్రాయుటకు నిర్ణయించుకొనలేదు. మొదటి శతాబ్దములోని క్రైస్తవుల యొక్క క్లిష్టమైన జీవిత స్థితులయందు ఈ పత్రిక యొక్క మూలమును కనుగొనవచ్చును. దానికి తోడుగా, ఈ పత్రిక నిలిచియుండుటకు ఒక సిద్ధాంతపరమైన కారణమున్నది. ఒక మానవ రచయిత ద్వారా తన ప్రజలతో మాట్లాడుటకు దేవునికి సందేశం కలదు.

యాకోబు మారుచున్న కాలములందు వ్రాయుచున్నాడు. సంఘము యొక్క తొలి దినాలలో కనిపించిన విపత్కరమైన వైఖరినుండి, అలవాటునుండి, సమస్యలనుండి (అతని పత్రిక యొక్క రచనా కాలం) చాలా దూరముగా తొలగించబడినది. వాటిలో కొన్ని:

- కష్టమైన పరీక్షలు
- పాపము చేయుటకు శోధన
- ఐశ్వర్యముతో చాలా రకములైన సమస్యలు
- వారు దేనిని నమ్ముచున్నారో దానిమీద జీవించుటకు చాల మంది ఓడి పోయారు
- సంఘములోని విభజనలు కలుగుటకు కారణమగునంతగా నాలుకను ఉపయోగించుట
- భౌతికంగా మరియు ఆత్మీయముగా బలహీనులైన క్రైస్తవులు

మనము ఆ సమస్యల పట్టికను పరిశీలిస్తుండగా, నేడు మన దినములలోని స్థానిక సంఘములు ఎదుర్కొనుచున్నటువంటి సమస్యలనే అది కలిగియున్నట్లుగా కనబడుచున్నది. మన సంఘములలోని ప్రజలు శ్రమలు పొందుచున్నారా? సభ్యులు మాట్లాడునది ఒక విధముగా మరియు జీవించడము వేరొక విధముగా కనిపిస్తుందా? ప్రపంచ ధర్మము చొప్పున

జీవించడం ఒక తీవ్రమైన సమస్యగా ఉందా? క్రైస్తవులు వారి నాలుకను అదుపుచేసుకొనుటలో ఒడి పోయారా?

ఈ పత్రిక నిరర్థకంగా వ్రాయబడలేదు. బదులుగా, మనము జీవించు ప్రతి స్థలములలోను మన క్రైస్తవ విశ్వాసము పనిచేయునట్లుగా అది హెచ్చరికలను కలిగియున్నది. దేవుని యొక్క ప్రజలు యేసునందు కేవలము ఆరంభ విశ్వాసము కలిగి యుండుటకు మాత్రమే యాకోబు అనుమతించుటలేదు. వారు నమ్మకమైన విధేయతలో ఎదగాలని, వ్యక్తిగతమైన సమర్పణ గలవారుగా ఉండాలని, యితరుల యెడల అంకిత భావంగలవారుగా ఉండాలని రచయిత ఉద్దేశించాడు. పత్రిక మొత్తములో వ్యక్తపరచబడిన చర్చినీయాంశం ఏమంటే, "ప్రత్యేక పరచునటువంటి ఒక విశ్వాసము."

యాకోబు పత్రిక పనికిరాని పాతబడిన ఒక పత్రిక కాదు. క్రైస్తవులు, ఆర్థిక తారతమ్యాలు, రాజకీయ అస్థిరత, మరియు విడగొట్టే సమస్యలు, అపవాదితో అంతర్గత పోరాటములు, స్వార్థ పూరితమైన హృదయము, మరియు ప్రజలు నమ్మకమును ప్రకటించుదురు కాని క్రైస్తవ్యము అనుసరించుటలేదు అను స్థితిగతులను క్రైస్తవులు ఎదుర్కొనునంతవరకు యాకోబు పత్రికలోని సందేశం యొక్క అవసరము ఉండును.

## వ్యక్తిగతమైన శైలి

"దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ..." (2 తిమోతి 3:16), అయినప్పటికి ప్రతి పుస్తకము దాని సొంత రచనా శైలిని కలిగియున్నది. దైవావేశము వలన కలిగిన లేఖనములయందు, మానవుని వ్యక్తిత్వమును దేవుడు దాటివేయలేదు, కాని పూర్తిగా ఆయన ఉద్దేశముల కొరకు ఉపయోగించుకొన్నాడు. ఈ పత్రిక, యితర బైబిలు రచనలవలే తనదైన సహజ అద్వితీయ రూపమును మరియు ప్రత్యేక సరళిని కలిగియుంది.

ప్రపంచ వ్యాప్తముగా ఉన్న దేవుని ప్రజలను సంబోధించిన మొదటి - శతాబ్దపు పత్రిక శైలి రూపమును యాకోబు పత్రిక కలిగి ఉంది. మొదటి - శతాబ్దపు సంఘములు కూడుకొనునప్పుడు, ఈ పత్రిక మొదటనుండి చివరి వరకు చదవబడేది, దీనిని చదువుటకు సుమారుగా ముప్పై నిమిషముల సమయమగును. స్పష్టమైన రూపకాలంకారములను, బలమైన చిన్న సామెతలను, అద్వితీయ నుడికారములను, పరిశోధనా ప్రశ్నలను, మరియు నిదర్శనాత్మకమైన ఉదాహరణలను యాకోబు ఉపయోగించినట్లు ఆ విశ్వాసులు విన్నారు. నిజానికి, యాకోబు 570 రకములైన వేర్వేరు గ్రీకు పదాలు ఉపయోగించాడు, వాటిలో 73 పదములను క్రొత్త నిబంధనలో ఎక్కడా కనుగొనలేము.

స్పష్టముగా కనిపించే రచనా శైలిగల యాకోబు పత్రికయందు మనము అద్వితీయతను చూడవచ్చును. నిజానికి పత్రికను చదువుచున్నప్పుడు, "ఈ మనుష్యుడు రచయిత కాకముందు ఒక బోధకుడై ఉన్నాడని" మనము చెప్పగలము. ఈ ఏకైక రచనా శైలి ఆర్. వి. జి. టాస్కర్‌నకు చాలా నచ్చింది గనుక అతడు, "యాకోబు పత్రిక కొన్ని ప్రసంగముల నోట్సు సేకరణ" అని చెప్పాడు.[2] ప్రమాణ గ్రంథమంతటిగుండ ఒక ప్రసంగికుడు తన ప్రేక్షకులను ఉద్దేశించి మాట్లాడినట్లు తన పాఠకులతో మాట్లాడుచున్నాడు (1:16, 19; 2:20). "సహోదరులు," "నా సహోదరులు" మరియు "నా ప్రియమైన సహోదరులు" అని హృదయంనుండి కలం ద్వారా వచ్చిన పదాలు సువార్తికునికి మరియు సంఘమునకు మధ్యకొనసాగిన ఉత్తేజపరచు

ప్రాణాధారమైన సంబంధమును మరలా మరలా తెలుపుతున్నాయి (ఉదా. 1:2, 16, 19; 2:1, 5, 14; 5:7, 9, మొదలైనవి).

**ముగింపు**

యాకోబు యొక్క సందేశము *మొదటి* శతాబ్దమునందున్న *మరియు* తరువాత శతాబ్దములన్నిటియందున్న క్రైస్తవుల కొరకు వ్రాయబడినది. మనము జీవించు అనుదిన జీవితము మన విశ్వాసమును ప్రత్యేకమైనదిగా చేయునని యాకోబు పత్రిక క్రైస్తవులకు బోధించుచున్నది.

---

సూచనలు

[1]Adapted from chapter 1 in Harold T. Bryson, *How Faith Works,* "Studies in the Letter of James" (Nashville, Tenn.: Broadman Press, 1984). [2]R. V. G. Tasker, *The General Epistle of James*, Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1980), 9.